బొడ్రాయిలో
మరిన్ని వ్యాసాలు
epaper.ntnews.com

**నమస్తే తెలంగాణ**

# బడి పిల్లలకు అల్పాహారం

**కడుపులో** ఆకలి కేకలు పెడుతుంటే బుర్రలో అక్షరాలు మొలవవు. బడులలో మధ్యాహ్న భోజన పథకానికి దారితీసింది ఈ సూత్రమే. అల్పాదాయ వర్గాల పిల్లలను చదువుకు దూరం చేసే భోజన సమస్య పరిష్కరిస్తేనే చదువులు సజావుగా సాగుతాయి. లేకపోతే డ్రాపౌట్లు, బాలకార్మిక వ్యవస్థ లాంటి అనాచారాలకు దారి ఏర్పడుతుంది. ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ సర్కారు పకడ్బందీగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో దీన్ని మొక్కుబడిగా దొడ్డుబొడ్డు బియ్యంతో, నీళ్లచారుతో 'మిధ్యాహ్న, అధ్వాన్న భోజన పథకం'గా మార్చిన సంగతి తెలిసిందే. కానీ సీఎం కేసీఆర్ సన్నబియ్యంతో కడుపునిండా అన్నం పెట్టాలని ఆదేశించడం చిన్నారుల పట్ల ఆయనకున్న అభిమానాన్ని తెలియజేస్తున్నది. అయితే అంతటితో సరిపెట్టకుండా మరో విప్లవాత్మకమైన పథకానికి శ్రీకారం చుట్టారు సీఎం కేసీఆర్. పోషకాలతో కూడిన రుచికరమైన భోజనం బడిపిల్లలకు అందుబాటులోకి వచ్చింది. కానీ అంబటాల్ల దాకా ఆగుతారా పిల్లలు? ఇంటిదగ్గర ఏమైనా తిని వస్తే ఫరవాలేదు. కానీ ఏమీ తినని పిల్లల సంగతేమిటి? ఉదయం పూట టిఫిన్ చేయకుండా బడికి వచ్చే పిల్లలకు ధ్యాసంతా ఎప్పుడు మధ్యాహ్నం అవుతుందా? అనేదాని మీదే ఉంటుంది. ఒక అంచనా ప్రకారం అల్పాహారం తీసుకోకుండానే బడికి వచ్చే పిల్లలు కనీసం 30 శాతం వరకు ఉంటారు. మరోవైపు పోషకాహార లోపం, రక్తహీనత సమస్య పిల్లలను వేధిస్తుండటం తెలిసిందే. ముఖ్యంగా అమ్మాయిల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటుంది.

ఈ పరిస్థితులన్నిటిని పరిగణనలోకి తీసుకున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు అల్పాహారం అందజేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడులో అల్పాహారం పథకం విజయవంతంగా నడుస్తున్నట్టు తెలుసుకొని అధికారుల బృందాన్ని అధ్యయనం నిమిత్తం ఆ రాష్ట్రానికి పంపారు. పథకం అమలవుతున్న విధివిధానాలపై ఇటీవలే ఆ బృందం సీఎంకు నివేదిక సమర్పించింది. తమిళనాడులో కేవలం ప్రాథమిక పాఠశాలల్లోనే అల్పాహారం పెడుతున్నారు. ఇలా చేస్తే ఇంట్లో ఒకరికి పెట్టి మరొకరికి పెట్టనట్టవుతుందని సీఎం కేసీఆర్ ఆలోచించడం గమనార్హం. ఎందుకంటే చాలాచోట్ల ప్రాథమిక, హైస్కూల్ తరగతులు ఒకే ప్రాంగణంలో నడుస్తున్నాయి. కొన్ని తరగతుల విద్యార్థులకు అల్పాహారం ఇచ్చి మిగతా పిల్లలను వదిలేయడం సబబు కాదని భావించి 1 నుంచి 10వ తరగతి వరకు పిల్లలందరికి దీన్ని అమలుచేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడం ముదావాహం.

రాష్ట్రంలో ఉన్న 28 వేల పాఠశాలల్లోని సుమారు 23 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకానికి రూ.400 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సంసిద్ధం కావడం ప్రశంసనీయం. అల్పాహారం కింద అందించే ఆహార పదార్థాల్లో పులిహోరా, పొంగల్, సేమియా, కిచిడీ, ఉప్మా వంటివి ఉన్నాయి. వీటికి తోడుగా పల్లీచట్నీ, సాంబార్ వంటివి ఇస్తారు. అల్పాహారం ప్రారంభించినప్పటికీ గుడ్డు, రాగిజావ యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించడం సర్కారు పెద్ద మనసుకు నిదర్శనం. దీనికి ముఖ్యమంత్రి అల్పాహార పథకంగా నామకరణం చేయడం సముచితంగా ఉన్నది. అక్టోబర్ 6 నుంచి ప్రవేశపెడుతున్న ఈ పథకం చిన్నారుల సంక్షేమంలో మరో ముందడుగు అవుతుందనడంలో సందేహం లేదు.

# మోదీ నోట శతాబ్దపు జోక్

> రోనాల్డ్ రీగన్, వ్లాదిమిర్ జెలెన్ స్కీ లాంటి నటులు దేశాధినేతలయ్యారు. ఎంజీఆర్, ఎన్టీఆర్, జయలలిత లాంటి వాళ్లు రాష్ట్రాల ముఖ్యమంత్రులయ్యారు. వీరంతా సినిమాల్లో నటులుగా వాళ్లు చేయాలనుకున్నదంతా చేసేసి, రాజకీయాల్లోకి వచ్చారు. రాజకీయాల్లో కూడా తమదైన శైలిలో ప్రజల కోసం ఎంతో కొంత చేయాలన్న తపనతో కృషిచేసి ప్రజల మెప్పు పొందారు. ఉక్రెయిన్ అధినేత జెలెన్ స్కీ అయితే ఈ రోజుకు కూడా యుద్ధభూమిలో తిరుగుతూ దేశం కోసం పోరాడుతున్నాడు.



**మనోహర్ చిమ్మని**



దీనికి పూర్తి వ్యతిరేకంగా కొన్ని చారిత్రక వింతలు, విడ్డూరాలు కూడా జరుగుతుంటాయి. ఉదాహరణకు ఒక వ్యక్తిలో తానొక మంచి నటుడు కావాలన్న తపన, తన డైలాగ్ డెలివరీతో క్లాస్, మాస్ తేడా లేకుండా అందరినీ ఆకట్టుకోవాలన్న తపన, అంతర్లీనంగా అతనిలో ఎక్కడో ఏ మూలో విపరీతంగా ఉంటుంది. కానీ, విధి వక్రీకరించి, అనుకోకుండా ఆ వ్యక్తి ఒక నాయకుడవుతాడు. ఫలితంగా.. అటు నాయకుడిగా ప్రజలకు ఎలాంటి సేవ చెయ్యలేడు. ఇటు తనలోని నటవైదుష్యాన్ని ప్రదర్శించుకోలేడు. నటునిగా అతని ప్రతిభంతా అప్పుడప్పుడు కొన్ని స్పీచ్‌లు, ఫొటోషూట్‌లు, వీడియో కవరేజీలకే పరిమితమైపోతుంది. ఇలాంటి దయనీయమైన మానసిక స్థితిలో నాయకుడిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించటం ఎవరికైనా అంత సులభం కాదు. ఎప్పటికప్పుడు కన్ఫ్యూజన్‌లో పడిపోతూ, అసలు తాను ఎప్పుడు, ఎక్కడ ఏం మాట్లాడుతున్నాడో కూడా తనకే అర్థం కాని స్థితిలో ఉంటాడు.

> మొన్న నిజామాబాద్‌లో మన ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం అంతా విన్న తర్వాత, నాకెందుకో ఆయన కూడా అలాంటి కన్ఫ్యూజన్‌లో ఉన్నారా అన్న సందేహం కలిగింది.

రాజకీయాల్లో విమర్శలు సహజం. ఇక ఎలక్షన్లు కూడా దగ్గరలో ఉన్నాయంటే రాజకీయపార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలు ఆకాశాన్నంటుతుంటాయి. ఇది కూడా సహజమే. కానీ, ఒక ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి చేసే ఆరోపణలు కానీ, విమర్శలు కానీ హుందాగా ఉండాలి. ఎదుటివారు సమాధానం ఇవ్వలేని స్థాయిలో వాస్తవాలై ఉండాలి. రానున్న ఎలక్షన్ల నేపథ్యంలో కావాలని ఏదైనా అబద్ధం చెప్పినా అది లాజిక్‌కు నిలబడాలి. దురదృష్టవశాత్తు, మొన్న మన ప్రధాని ఉపన్యాసంలో ఆయన మాట్లాడిన మాటలు అలా లేవు. అర్థం పర్థం లేని డ్రామా డైలాగుల్లా ఉన్నాయి.

భారత స్వాతంత్ర్య సమరయోధుడు, నెహ్రూకు సరిసమానుడైన దేశ నాయకుడు, ఉక్కుమనిషి సర్దార్ పటేల్ స్థాయిని తగ్గించేలా మాట్లాడటం అవమానకరం. అప్పటి హైదరాబాద్ స్టేట్ ప్రజల పోరాటాన్ని గుర్తించి, భారత ప్రభుత్వ నిర్ణయం మేరకు, హైదరాబాద్‌ను విముక్తం చేసే విషయంలో పటేల్ ఒక కేంద్ర హోంమంత్రి హోదాలో తన బాధ్యత నిర్వర్తించారు తప్ప, ఒక గుజరాతీ బిడ్డగా కాదు.

తాను ప్రధానమంత్రి అయినప్పటి నుంచి ఇప్పటివరకు, ఈ పదేండ్లలో తెలంగాణలో కనీసం ఒక్క ప్రాజెక్టుకు అయినా జాతీయస్థాయి హోదా ఇవ్వలేదు, ఒక కొత్త ప్రాజెక్టునివ్వలేదు, ఒక ఇండస్ట్రీనివ్వలేదు, ఒక మెడికల్ కాలేజీ లేదు, ఒక నవోదయ విద్యాలయ లేదు. గుర్తొచ్చినప్పుడల్లా తెలంగాణ ఆవిర్భావం మీద విషం కక్కడం తప్ప ఆయన తెలంగాణకు చేసిందేమీ లేదు. అలాంటి వ్యక్తి మరో గుజరాతీ బిడ్డగా నేను తెలంగాణ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నా అనడం హాస్యాస్పదం, అవమానకరం. పైగా, ప్రధానమంత్రి అంటే దేశం మొత్తానికి చెందినవాడవుతాడు కానీ, నేను గుజరాతీ బిడ్డగా ఇది చేస్తున్నాను, అది చేస్తున్నానని తన స్థాయిని తగ్గించుకోడు.

కేసీఆర్ ఎన్డీయేలో చేరతామంటే మోదీ ఒప్పుకోలేదట! జీహెచ్‌ఎంసీ మేయర్ ఎన్నికల్లో మద్దతు కోసం కేసీఆర్ ఢిల్లీ వెళ్లి మోదీని కలిశారట! అబద్ధం ఆడినా అతికినట్టు ఉండాలంటారు పెద్దలు. ఎప్పుడూ ప్రస్తావనలోకి రాని ఎన్డీయేలో కేసీఆర్ చేరాలనుకుంటారనుకోవడం అవివేకం. అంతేకాదు, లోకల్‌గా ఒక మేయర్ పదవి కోసం కేసీఆర్ ఢిల్లీ వెళ్లి మోదీని కలుస్తారనుకోవడం ఎవరూ నమ్మలేని మరొక పచ్చి అబద్ధం.

పద్నాలుగేండ్ల సుదీర్ఘ పోరాటం ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, తెలంగాణ ప్రజల ద్వారా ముఖ్యమంత్రిగా ఎన్నికై, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ, వచ్చే ఎన్నికల తర్వాత ముచ్చటగా మూడోసారి కూడా తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న కేసీఆర్‌ను నరేంద్ర మోదీ తిరస్కరించడమేంటి?

గత 60 ఏండ్లుగా ఈ ప్రాంతం కోసం ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయనన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేసి చూపిస్తూ, ప్రపంచస్థాయి నాయకులు, సంస్థలతో శభాష్ అనిపించుకుంటున్న కేసీఆర్ అవినీతిపరుడెలా అవుతాడు? కేంద్రంలో ఉన్నది మీరే కదా, మరి ఎందుకని ఆయన అవినీతిని బయటపెట్టడం లేదు? వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అధికారమిస్తేనే ఆయన అవినీతిని బయటపెడతామనడం ఎంత ఎడాలిసెంట్ మాట? నిజానికి ఎక్కడ అవినీతి పొంగిపొర్లుతోందన్నది కట్టిన కొన్నిరోజులకే కూలిపోతున్న బ్రిడ్జిలు, ఫ్లయి ఓవర్లే చెప్తున్నాయి. ఆ స్థాయి అవినీతి ఉన్నది తమ సొంత బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అక్కడి అవినీతి గురించి మోదీ ముందు ఆలోచించాలి.

దేశ ప్రజలు సంపూర్ణ మెజారిటీతో రెండుసార్లు బంగారు పళ్లెంలో పెట్టి అధికారం చేతికి అందించినప్పుడు, పదేండ్లలో దేశాన్ని అభివృద్ధి పథంలో ప్రపంచం నివ్వెరపోయేస్థాయికి తీసుకువెళ్లవచ్చు. దురదృష్టవశాత్తు, నరేంద్ర మోదీ ప్రభుత్వం అలా చేయలేకపోయింది. పవర్ ఉపయోగించి రాష్ట్రాల్లో అధికారం చేజిక్కించుకోవడం, సున్నిత విషయాల్లో ప్రజలను రెచ్చగొట్టి ఎప్పటికప్పుడు ఎన్నికల్లో గెలవాలనుకోవడం వంటి 'అధికారం' ప్రధాన లక్ష్యంగానే వారు ఏదైనా చేయగలిగారు తప్ప, 'అభివృద్ధి' గురించి ఆలోచించలేకపోయారు.

> ప్రధానిగా నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రిగా కేసీఆర్ దాదాపు ఒకే సమయంలో పదవుల్లోకి వచ్చారు. రాష్ట్రస్థాయిలో ఒక ముఖ్యమంత్రిగా కేసీఆర్ సాధించిన ఎన్నో అద్భుత విజయాల్లో కనీసం 10 శాతం విజయాలను కూడా కేంద్రస్థాయిలో ప్రధాని మోదీ సాధించారా? అన్నది జవాబు దొరకని ప్రశ్న.

కట్ చేస్తే... సామర్థ్యం ముందు వారసత్వం అనే పదానికి అర్థం లేదు. అలాగే, సామర్థ్యానికి వారసత్వం అనేది ఎప్పుడూ అడ్డు కాకూడదు. కేటీఆర్ విషయంలో వారసత్వం అనేది కేవలం అతని పొలిటికల్ ఎంట్రీకి మాత్రమే ఉపయోగపడవచ్చు. కానీ, ఆ తర్వాత అంతా కేటీఆర్ స్వయంకృషే అన్నది పార్టీలకతీతంగా ఎవరైనా సరే ఒప్పుకొని తీరాల్సిన నిజం. స్వయంగా ఎందరో కేంద్రమంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రపంచస్థాయి కంపెనీల సీఈవోలే ఎన్నోసార్లు కేటీఆర్ సామర్థ్యం గురించి వివిధ వేదికలపై ఎంతగానో మెచ్చుకుంటూ మాట్లాడారు.

ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్టు, కేటీఆర్ ఏ స్థాయికి ఎదిగినా కేసీఆర్ తనయుడే. కానీ, కేటీఆర్ అంటే ఇప్పుడొక బ్రాండ్. భారత రాజకీయాల్లో ఒక రాక్‌స్టార్. కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చెయ్యాలనుకుంటే రెండే రెండు నిమిషాలు చాలు. అసెంబ్లీలో సంపూర్ణ మెజారిటీ ఉన్న బీఆర్ఎస్ ఎల్పీ సింగిల్ లైన్ ప్రపోజల్‌తో చేసుకోగలుగుతుంది. కానీ, కేటీఆర్ ముఖ్యమంత్రి కావడం కోసం కేసీఆర్ నరేంద్ర మోదీ ఆశీస్సులు కోరారనటం ఈ శతాబ్దపు పెద్ద జోక్. కేవలం వాట్సాప్ యూనివర్సిటీతో తలపండినవారు మాత్రమే ఇలాంటి జోకులను ఎంజాయ్ చేయగలుగుతారు.

సభకు వచ్చిన ప్రజల చప్పట్ల కోసం చీప్ ట్రిక్స్ ప్లే చేయడం వేరు. మనం చీప్ అయిపోవడం వేరు. రెండోది అత్యంత విషాదం. మొన్నటి నిజామాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ స్పీచ్‌లో కనిపించింది ఆ విషాదమే.

**(వ్యాసకర్త: సినీ దర్శకుడు, రచయిత)**

# ఢిల్లీ పాదుషా 'పోంజీ' రాజకీయం



**హరీశ్ ఖరే**



> కశ్మీర్‌లో కాంగ్రెస్ పోటీ చేయరాదనే దుందుడుకు ప్రతిపాదన ఒకటి అప్పట్లో వచ్చింది. అదీ శక్తిమంతురాలైన నేతగా పేరుపొందిన ఇందిరాగాంధీ ముందుకు. ఆ సూచన చేసింది కశ్మీర్ కాంగ్రెస్ ప్రముఖ నాయకుడు సయ్యద్ మీర్ కాశీం.

1983 తొలినాళ్లలో కాశీం ఇందిరతో కశ్మీర్ సమస్యపై వాదం వేసుకున్నారు. కశ్మీర్ వృద్ధ నేత షేక్ అబ్దుల్లా కన్నుమూశారు. ఈ నేపథ్యంలో వేర్పాటువాద ధోరణులను అరికట్టి, పాక్ అనుకూల శక్తులకు ముకుతాడు వేయాలంటే కశ్మీర్ లోయలో ఫరూక్ అబ్దుల్లాను బలపరచక తప్పదని ఆయన చెప్పారు. అవగాహన లేకనో, మరే ఇతర మరుగుపర్చిన కారణం వల్లనో కాశీం ఆ మాట అనలేదు. ఎందుకంటే కల్లోల కశ్మీర్‌కు అంతకుముందే కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకున్నది. కాంగ్రెస్ ఎన్నికల బరిలో ఉండటం వల్ల నేషనల్ కాన్ఫరెన్స్ బలహీనపడి భారత వ్యతిరేకులకు ఊతం లభిస్తుందని ఆయన ఉద్దేశం. ఇందిర-కాశీం వాగ్వాదం వారాల పాటు నడిచింది. ఇందిర అంతిమంగా ఆయన సూచనను కొట్టిపారేశారు. తాను కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నంత వరకు భారతదేశంలోని ఏ ప్రాంతంలోనూ పార్టీని ఎన్నికల పోటీ నుంచి తప్పించే పనిని చేయలేనని, చేయబోనని నిక్కచ్చిగా సమాధానం ఇచ్చారు.

ఆమె ఇచ్చిన సమాధానం ఎంత ఘాటుగా ఉందనేది అలా ఉంచితే అది భారత దేశాన్ని నయానా భయానా పాలించాలనుకునే ఏ పార్టీకైనా వర్తించే అక్షర సత్యమే. పార్లమెంటు ఉభయ సభల్లో కాంగ్రెస్‌కు బలమైన మెజారిటీ ఉంది. అలాగే దేశంలోని పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. అలాంటప్పుడు అంతటా మనమే ఉండాలన్న భావన ఆమెలో వేళ్లూనుకోవడంలో వింతేమీ లేదు. కొన్నాళ్ల తర్వాత అలీనోద్యమ శిఖరాగ్ర సభలో, ఆ తర్వాత కామన్వెల్త్ సభలో ప్రపంచ నేతలకు ఆతిథ్యం ఇవ్వబోతున్నారామె.

అంతటి ఘనమైన నేపథ్యంలో దేశంలోని మూలమూలనా తమ పార్టీ అస్తిత్వంలో ఉండాలని, తమ రాజకీయ-సైద్ధాంతిక విశ్వాసాలను ప్రచారంలోకి తేవాలని ఆమె కోరుకోవడం సహజమే.

పరిపాలనకు సహజంగా అనువైన పార్టీననే స్వీయభావన కాంగ్రెస్‌కు బలంగా ఉండేది. కేంద్రంలో, అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉండటం వల్ల ఆ పార్టీ నాయకత్వానికి చిన్నాచితకా పార్టీలను పోటీలో లేకుండా చేయడానికి, వాటిల్లోని నాయకులను ప్రలోభపెట్టి తన వైపు తిప్పుకొనేందుకూ అవసరమైన వనరులు అందుబాటులో ఉండేవి.

సామ్రాజ్యంపై కేంద్రంలోని చక్రవర్తుల ప్రాబల్యానికి, రాష్ట్రాల రాజధానుల్లోని ప్రాంతీయ భాష, సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన మనోభావాలకు మధ్య అంతర్గతమైన ఉద్రిక్తత ఒకటి ఉండేది. అదే సమయంలో కేంద్రం దొరతనానికి, సమాఖ్య/ప్రాంతీయ/ స్థానిక ఆకాంక్షలకు నడుమ సమతూకం పాటించడమే కేంద్ర ప్రభుత్వాలకు తప్పనిసరిగా అవసరమైన రాజనీతిజ్ఞతగానూ ఉండేది. ఇదంతా ఒకరోజు వ్యవహారం కాదు. నిరంతర ప్రక్రియ. ఎప్పుడూ పూర్తిగా పరిష్కారం కాదు. ఎప్పుడూ పూర్తిస్థాయిలో ఘనీభవించదు. ఢిల్లీ రాజకీయ నాయకత్వానికి జర్మన్లు 'ఫింగర్ స్పిట్జ్ ఎంగెర్ ఫ్యూహల్' అని పిలిచే తత్వం దండిగా అవసరం. వ్యూహకర్త తెలివైన అత్యుత్సాహాన్ని నివారించే, బుద్ధి కుశలతతో కూడిన నిర్ణయ సాధన సామర్థ్యం అని దాని అర్థం.

యునైటెడ్ ఫ్రంట్, ఎన్డీయే, యూపీయే ఇలా ప్రయోగం ఏదైనా సరైన భాగస్వామ్య పరిభాష మీదే దాని మనుగడ ఆధారపడి ఉంటుంది. భాగస్వామ్యం పట్ల అంకితభావం, గౌరవం, కీర్తి, ప్రోత్సాహం, రాజకీయ లాభాల పంపిణీకి సరైన విధానం దానికి ముఖ్యమైన అవసరం. భాగస్వాములందరూ సంకీర్ణ ధర్మానికి కట్టుబడి ఉన్నంతవరకే సర్దుబాటు సాగుతుంది.

ఏతావాతా నరేంద్ర మోదీ రంగం మీదికి వచ్చారు. ఆయన నాయకత్వంలో బీజేపీ 2014లో, 2019లో.. రెండుసార్లు లోక్‌సభలో మెజారిటీ సాధించింది. నిజానికి ఆ పార్టీకి భాగస్వాముల అవసరం లేకుండింది. కానీ అఖిలభారత స్థాయి గుంపుగా చూపించుకోవాల్సిన రాజకీయ ఎత్తుగడలో భాగంగా కొనసాగించారు. కానీ క్రమంగా, అనివార్యంగా అది 1983 నాటి ఇందిర మానసిక స్థితికి చేరుకోక తప్పలేదు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ వంటి చోట్ల కూడా పెత్తనం చేయాలని బీజేపీ కోరుకుంటున్నది.

ప్రస్తుతం మోదీ బీజేపీ 2014కు ముందు నుంచి కేంద్ర, సమాఖ్య విభాగాల మధ్య సహజీవనంతో కూడిన సర్దుబాటు సూత్రాలను పక్కన పెట్టాలని చూస్తున్నది. ఈ సూత్రాలను 2005లో జరిగిన జాతీయ సమగ్రతా మండలి సమావేశంలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చక్కగా ఇలా వివరించారు: ప్రాంతీయ, ఉప ప్రాంతీయ అస్తిత్వాలు ముందుకువస్తున్నాయి. 60 ఏండ్ల కిందట ఇది అనూహ్యమైన విషయం. మనది బహుళత్వ సమాజం, బహుళత్వ రాజకీయ వ్యవస్థ. ప్రాంతీయ, ఉప ప్రాంతీయ అస్తిత్వాలకు మన దేశంలో తగినంత వెసులుబాటు ఉన్నది. మన జాతీయతకు ఇవి ప్రతికూలమైనవి కావు. ఈ ప్రాంతీయ అస్తిత్వాల పునర్వికాసాన్ని మనమంతా ఆహ్వానించాలి. ఏకరూపత కన్నా సామరస్యంపై మనం దృష్టి ఎక్కువగా నిలపాలి. అదే సమయంలో ఈ స్థానిక అస్తిత్వాలు విచ్చిన్నవాదం వైపు, వేర్పాటువాదం వైపు వెళ్లకుండా మన వైవిధ్య భరితమైన బహుళత్వంలో సామరస్య పూర్వకంగా మమేకమయ్యేలా చూడాలి.

ప్రస్తుత కాలంలో మోదీ గుంపు ఈ తరహా సర్దుబాటు సూత్రాలను జాతీయ బలహీనతగా, చేతకాని తనంగా చూస్తున్నది. కానీ గుజరాతీ అస్తిత్వం పేరిట మోదీ దిగేందుకు కారణమైనది జాతీయతను నిర్వచించిన ఈ తరహా విజ్ఞత, సమతూక వైఖరులేననేది మరచిపోరాదు.

> మన్మోహన్‌సింగ్ వైఖరి కల్పించిన వెసులుబాటు అనేది లేకపోతే మోదీ చరిత్రలో కేవలం ఓ అధోజ్ఞాపికగా మాత్రమే మిగిలిపోయేవారు.

అలాంటి విజ్ఞతను మోదీ బీజేపీ ఇప్పుడు పక్కనపెట్టింది. నాగపూర్ ప్రేరేపిత హిందీ, హిందూ, హిందూస్థాన్ అనే ఆధిపత్య ఏకీకరణ విధానాన్ని అమలులోకి తేవాలని చూస్తున్నది. మోదీ వ్యక్తిత్వాన్ని చిలవలు పలవలుగా పెంచేసి ఆకాశానికి ఎత్తేశారు. భారతదేశ మహోన్నత నేతగా ప్రచారం చేసే తంతు ఎప్పటినుంచో అమలవుతున్నది. ఈ ఎదురులేని మోదీ ప్రచార పటాటోపంలో కులం, వర్గం, ప్రాంతం లేదా మతానికి చోటులేదు. ఎందుకంటే మోదీ ఆకర్షణీయతకు వాటితో నిమిత్తం లేదు. ఈ విధానంలోని అంతర్గత తర్కం ప్రకారం బీజేపీ ప్రతి గల్లీలో, బస్తీలో, పేటలో బీజేపీయేతర శక్తులను, మనోభావాలను తరిమికొట్టేందుకు దూకుడుగా దూసుకుపోవాలి.

ఇంకా కొన్ని చిన్నాచితకా పార్టీలు బీజేపీతో అంటకాగాలని చూస్తుండటం అర్థమయ్యే విషయం కానప్పటికీ వాస్తవం. మోదీ బీజేపీతో పొత్తు పెట్టుకుంటే ఏదో లబ్ధి దొరుకుతుందని అవి నమ్ముతున్నాయి. తమ తమ ప్రాంతీయ లెక్కలు, ఒత్తిడుల కారణంగా చిరాగ్ పాశ్వాన్‌లు, దేవేగౌడలు మోదీ బీజేపీతో బేరసారాలాడి గట్టెక్కాలని చూస్తున్నాయి. బీజేపీ చాణక్యులు వ్యూహాత్మకంగా ఈ తరహా పొత్తులతో విపక్షాలకు చెందిన ఆ కాసిన్ని ఓట్లన్నా లాగేసుకున్నట్టు అవుతుందని అనుకోవడంలో తప్పు లేదు. పైగా మిత్రపక్షాలు ఎన్ని ఎక్కువుంటే అంతమంచిది. విశ్వగురు వెనకాల ఇంత సువిశాలమైన రాజకీయ అభిప్రాయాలు మోహరించాయని చెప్పుకొనేందుకు వీలుంటుంది.

రాజకీయ విజ్ఞతకు, నైతికతకు జాతీయ ఎన్నికల సందర్భం అంత అనువైన సమయం కాదనేది నిజమే. సిగ్గూ ఎగ్గూ లేని అవకాశవాదాల, వాగాడంబరాలే ఈ సమయంలో రాజ్యమేలుతాయి. ఇదీ భారత్‌లోని పాత చింతకాయ లాంటి, చెడు వ్యవస్థ. ప్రస్తుతం ఎన్డీయే పట్ల బీజేపీ దృక్పథం మనకందరికీ తెలిసిన పోంజీ, అంటే, మోసకారుల గొలుసుకట్టు వ్యాపారంలా ఉంది. నేను నీ జేబు కొడతా.. నీవు నీ కిందివాడి జేబు కత్తిరించు అనేదే దీనివెనుక ఉన్న సూత్రం. ఈ గజి బిజి వ్యాపారంలో కొత్తది, మహోన్నతమైనది అంటూ ఏమీ లేదు. కేవలం నిజాయితీ లేనితనానికి అందమైన మెరుగులద్దడం. అంతకు మించి ఏమీ లేదు. ఇదే మన నయాభారతం. మరి స్వాగతిద్దామా?

**('ది వైర్' సౌజన్యంతో)**

**(అనువాదం: తుమ్మలపల్లి రఘురాములు)**

> స్వరాష్ట్రంలో సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తూ దేశానికే మార్గదర్శకంగా నిలుస్తున్నారు ముఖ్యమంత్రి కేసీఆర్. అందులో భాగస్వాములవుతున్న ఉద్యోగులకు సైతం అదే ప్రాధాన్యం ఇస్తున్నారు. అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి నేటివరకు.. ఉపాధ్యాయ, ఉద్యోగులతో ఫ్రెండ్లీ ప్రభుత్వాన్ని నడుపుతూనే లక్షలాది మంది ఉద్యోగులు సగర్వంగా స్వరాష్ట్రంలో తలెత్తుకునేలా వేతనాలు పెంచుతూ వస్తున్నారు.

# ఇది కదా ఫ్రెండ్లీ గవర్నమెంట్?



**కడపత్రి ప్రకాశ్‌రావు**
80966 77022



దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా వేతనాలు కల్పిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి తాజా పీఆర్సీ కమిటీ విషయంలోనూ సంచలన నిర్ణయమే తీసుకున్నారు. కమిటీ వేసిన రోజునే ఐదు శాతం మధ్యంతర భృతి ప్రకటించడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా.. గత రెండు పీఆర్సీల్లో దేశంలోనే అత్యధిక ఫిట్‌మెంట్ ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిది. గత తొమ్మిదేండ్లలో ఉద్యోగులకు సంబంధించి పెంచిన వేతనాలు, ఇచ్చిన ఫిట్‌మెంట్‌లు, పెరిగిన గ్రాట్యుటీ, అలవెన్స్‌లు, ఇతర సౌకర్యాలను పరిశీలిస్తే... ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉద్యోగులపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతున్నది. ప్రభుత్వం పగ్గాలు చేపట్టగానే... స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యోగ, ఉపాధ్యాయులను దృష్టిలో పెట్టుకొని 2014లోనే ఒక ఇంక్రిమెంట్ ఇచ్చింది. ఈ ఇంక్రిమెంట్ పూర్తికాలం పనిచేసేలా నాడే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

ఉద్యోగుల పోరాటాన్ని గుర్తించి ఇంక్రిమెంట్ ఇవ్వడమనేది దేశంలోనే తొలిసారి. ఇంక్రిమెంట్‌కే పరిమితం చేయకుండా.. 2014 పీఆర్సీలో భాగంగా వేతన స్కేళ్లను సవరించిన ప్రభుత్వం.. ఉద్యోగుల అంచనాలకు భిన్నంగా 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగులపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. నిజానికి 43 శాతం ఫిట్‌మెంట్ అనేది ఒక చారిత్రాత్మక నిర్ణయం. అలాగే 2018 పీఆర్సీకి సంబంధించి 2020, డిసెంబర్ 31న నాటి కమిటీ చైర్మన్ బిస్వాల్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. 7 శాతం ఫిట్‌మెంట్ పెంచడానికి బిస్వాల్ కమిటీ సిఫారసు చేసింది. కానీ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టి లో పెట్టుకున్న సీఎం పీఆర్సీ నివేదికను పక్కనపెట్టి అసెంబ్లీ సాక్షిగా 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి మరోమారు కేసీఆర్ తన అభిమానాన్ని చాటుకున్నారు. స్వరాష్ట్రంలో ఇప్పటివరకు రెండు పీఆర్సీల ద్వారా 73 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన ఏకైక సీఎం కేసీఆరే. స్వరాష్ట్రం వస్తే.. ఉద్యోగుల వేతనాలు అనూహ్యంగా పెరుగుతాయని ఉద్యమ సమయంలోనే చెప్పిన కేసీఆర్.. కరోనా లాంటి పరిస్థితులకు ఏ మాత్రం వెరువకుండా ఉద్యోగులపై తనకున్న ప్రేమను చాటారు. రెండు పీఆర్సీల ద్వారా ఫిట్‌మెంట్ 73 శాతం పెరగడంతో నేడు దేశంలో అత్యధిక వేతనాలు తెలంగాణ ఉద్యోగులే పొందడం గర్వకారణం. గత రెండు పీఆర్సీల్లో రికార్డులు సృష్టించిన ప్రభుత్వం.. తాజా పీఆర్సీలోనూ అదే తీరుతో ముందుకువెళ్తున్నది. తాజాగా.. రిటైర్డు ఐఏఎస్ అధికారి శివశంకర్ చైర్మన్‌గా పీఆర్సీ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం జీవో-159ను జారీ చేసిన విషయం తెలిసిందే. నివేదికను 6 నెలల్లోపు ఇవ్వాలని నిర్దిష్ట గడువు పెట్టడంతోపాటుగా.. 5 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ను చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఐఆర్ అక్టోబర్ నుంచే వర్తింపజేయనున్నట్టుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఇప్పటివరకు సమైక్య రాష్ట్ర చరిత్రలోని పీఆర్సీలను గమనిస్తే.. అవి నివేదిక ఇచ్చేవరకు మధ్యంతర భృతిని ప్రకటించిన దాఖలాల్లేవు. కానీ, కమిషన్ ఏర్పాటు చేసిన రోజే మధ్యంతర భృతి ప్రకటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

అలాగే ప్రభుత్వంలో టీఎస్ ఆర్టీసీ విలీనం చేశారు. దీని ద్వారా 43 వేల మంది కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారిపోయారు. వీఆర్ఏలకు ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రతిపత్తిని కల్పించింది తెలంగాణ ప్రభుత్వం. వీరి సేవలను క్రమబద్ధీకరిస్తూ పే స్కేలు అమలు చేసింది. వీరందరి విద్యార్హతలు, సామర్థ్యాలను బట్టి ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం కొత్తగా 14,954 పోస్టులను మంజూరు చేసింది. గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దశాబ్ది ఉత్సవాలను నిర్వహించిన ప్రభుత్వం ఆ సందర్భంగా ఉద్యోగులకు భారీగా అలవెన్సులు, అడ్వాన్సులు ఇతర సౌకర్యాలు సదుపాయాలు కల్పిస్తూ ఆదేశాలిచ్చింది. అంతేకాదు.. మహిళా ఉద్యోగుల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రభు త్వ ఉద్యోగులతో పాటుగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచింది. ఇవేకాదు.. మహిళా ఉద్యోగులపై ప్రత్యేక చర్యలు తీసుకున్నది. అలాగే అలవెన్సులు.. ఇతర సౌకర్యాల విషయంలోనూ ఏ రాష్ట్రంలో లేని నిర్ణయాలు తీసుకుంటూ ఉద్యోగుల పెన్నిధిలా తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తున్న తీరు ప్రస్తుతం దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నది.

**(వ్యాసకర్త: నమస్తే తెలంగాణ ప్రతినిధి, కరీంనగర్)**